క్లుప్తంగా

ధ్రువపత్రాల మంజూరులో జాప్యం వద్దు



తహసీల్దార్ రవికుమార్‌రాజును సన్మానిస్తున్న ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, నాయకులు

కార్వేటినగరం: రైతులు, విద్యార్థులకు అందించే ధ్రువపత్రాల మంజూరులో ఆలస్యం వద్దని తహసీల్దార్ రవికుమార్‌రాజు అన్నారు. గురువారం సీడీకంద్రిగ సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ధ్రువపత్రాల మంజూరు కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులు, విద్యార్థులకు జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు అందించాలన్నారు. సచివాలయ పరిధిలో భూసమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, వివాదాస్పదమైన భూసమస్యలను మండలస్థాయికి తీసుకురావాలని, అక్కడ పరిష్కారం కాని వాటిని మాత్రమే జిల్లాస్థాయికి పంపాలని తెలిపారు. సచివాలయ స్థాయిలో పరిష్కరించకపోతే రైతులు జిల్లాస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి వెళ్తున్నారని, అలాకాకుండా చిన్నచిన్న సమస్యలను సచివాలయం లేదా మండల స్థాయిలోనే పరిష్కరించుకోవాలని చెప్పారు. అనంతరం తహసీల్దార్‌ను ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ధన్‌రాజ్, రాజారాం, డీలర్ సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిరెడ్డి, మునిమందడి, సుబ్బయ్యమందడి, వెంకటేష్, మహేష్ పలువురు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ప్రతాప్‌స్వామి

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం 5వ వార్షికోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తి ప్రపత్తులతో హనుమంతుడికి పూజలు జరిగాయి. వడమాల, తోమాలసేవ చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందించి, అనంతరం అన్నదానం చేశారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, కమిటీ సభ్యులు

విజయపురం (నగరి) : మండల కేంద్రంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో శ్రీహరిపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గురువారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా భారతీయ రిజర్వు బ్యాంకు వారు నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత క్విజ్ పోటీల్లో శ్రీహరిపురం ఉన్నత పాఠశాలకు చెందిన శ్రావణి, యమున ప్రతిభ కనబరిచారు. వీరికి రూ.3 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను బహూకరించారు. ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్, పేరెంట్స్ కమిటీ సభ్యులు విజేతలైన విద్యార్థులను అభినందించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు

పిల్లల్లో సామర్థ్యాలను పెంచేలా అభ్యసనాలు



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ విజయకుమార్

కార్వేటినగరం: విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేవిధంగా ఉపాధ్యాయులు విద్యాభ్యాసన చేపట్టాలని ఎంఈఓ విజయకుమార్ అన్నారు. గురువారం ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన టీఏఆర్ఎల్ శిక్షణా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. అదనపు ఎంఈఓ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో నిపుణులు కరణం గిరిబాబు, రఘురామకృష్ణ, నరేష్, సర్దార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అతివేగం అనర్థాలకు మూలం

పుత్తూరు రూరల్: అతివేగం అనర్థాలకు మూలమని, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు తమ వాహనాల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పుత్తూరు ఎంవీఐ పి.చంద్రశేఖర్ సూచించారు. గురువారం స్థానిక వెంకట పెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాలలో పుత్తూరు పరిధిలోని విద్యాసంస్థల వాహనాల డ్రైవర్లకు రిఫ్రెషర్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ బస్సుల డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడపడం, అతివేగంగా నడపడం చేయరాదని స్పష్టం చేశారు. బస్సుల నిర్వహణ, పాటించాల్సిన జాగ్రత్తలు, విద్యార్థులను గమ్యస్థానాలకు చేర్చాల్సిన విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ టి.హెచ్.హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.







ఎస్‌ఆర్‌ఎస్ కళాశాలలో అడ్మిషన్లు పొందుతున్న విద్యార్థులు, బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొందుతున్న విద్యార్థినులు, ఇంటింటికి వెళ్లి అడ్మిషన్లు నమోదు చేస్తున్న అధ్యాపక బృందం

సర్కారు కాలేజీల్లో అడ్మిషన్ల జోరు

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు జోరు కొనసాగుతోంది. ఏటా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు సంఖ్య పెరుగుతోంది. ప్రాథమిక, హైస్కూళ్లలో విద్యార్థులకే కాకుండా ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాలకు అమ్మఒడి నగదును ప్రభుత్వం అందిస్తోంది. నాడు–నేడు కింద ఇప్పటికే తొలివిడతలో చాలా స్కూళ్లు, కాలేజీలను అభివృద్ధి చేయగా, తాజాగా రెండోవిడతలో జూనియర్ కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. దీంతో కళాశాలలు మరింత అభివృద్ధి చెందనున్నాయి.

- విద్యాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం
- నాడు–నేడుతో మారి సర్కారు విద్యాసంస్థల రూపురేఖలు
- విద్యా సంవత్సర క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం



బాలికల జూనియర్ కళాశాల ముఖద్వారం

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు జోరుగా జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచే జూనియర్ కళాశాలలు అధికారికంగా పని చేస్తున్నాయి. వేసవి తీవ్రత కారణంగా కళాశాలలకు విద్యార్థుల రాక నిదానంగా ప్రారంభమైంది. స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో సైతం అడ్మిషన్లు ఊపందుకున్నాయి. బాలికల కళాశాలలో ఇప్పటివరకు 103, బాలుర కళాశాలలో 79 అడ్మిషన్లు జరిగాయి. ఆయా కళాశాలల్లో ఇప్పటికే రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు వెలువడిన తరువాత అడ్మిషన్లు మరింతగా పెరిగే అవకాశం ఉందని కళాశాల ప్రిన్సిపల్స్ చెబుతున్నారు.

ఈ ఏడాది పరీక్షలు ఇలా..

ఈ ఏడాది 2023–24 విద్యా సంవత్సరంలో జూనియర్ కళాశాలల్లో 227 పని దినాలు ఉండే విధంగా ఇంటర్మీడియట్ బోర్డు విద్యా ప్రణాళికను విడుదల చేసింది. జూలై 26వ తేదీ నుంచి 28 వరకు ఫస్ట్ యూనిట్, ఆగస్టు 24 నుంచి 26 వరకు సెకండ్ యూనిట్ పరీక్షలు నిర్వహించనున్నారు. మూడు నెలల పరీక్షలు సెప్టెంబర్ 16 నుంచి 23వ తేదీ వరకు జరుగుతాయి. మూడో యూనిట్ పరీక్షలు అక్టోబర్ 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తారు. దసరా సెలవులను అక్టోబర్ 19 నుంచి 25వ తేదీ వరకు ప్రకటించారు. నాలుగో యూనిట్ పరీక్షలు నవంబర్ 23 నుంచి 25వ తేదీ వరకు, ఆరు నెలల పరీక్షలు డిసెంబర్ 18 నుంచి 28వ తేదీ వరకు ఉంటాయి. సంక్రాంతి సెలవులు 2024 జనవరి 11 నుంచి 17వ తేదీ వరకు ఇవ్వనున్నారు. ప్రీ ఫైనల్ పరీక్షలు జనవరి 19 నుంచి 25వ తేదీ వరకు, ఫిబ్రవరి రెండవ వారంలో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. వార్షిక పరీక్షలు మార్చి మొదటి వారంలో నిర్వహించేలా విద్యా ప్రణాళికలను ఇంటర్ బోర్డు ప్రకటించింది.

పెరుగుతున్న అడ్మిషన్లు..



విద్యారంగాన్ని ప్రభుత్వ అన్నివిధాలా ప్రోత్సహిస్తుండడంతో అడ్మిషన్లు పెరుగుతున్నాయి. పుత్తూరు ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వం రూ.1.10 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులు సైతం జరుగుతున్నాయి. దీంతో కళాశాల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం మాకు కొండంత బలం. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ మాపై బాధ్యత మరింతగా పెరుగుతోంది. ఆ దిశగా మా అధ్యాపక బృందం అన్నివేళలా నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది.

– డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్, ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, పుత్తూరు

మంత్రి రోజా చొరవతోనే..



రాష్ట్ర మంత్రి రోజా చొరవతోనే నగరి నియోజకవర్గంలో కళాశాలలకు మహర్దశ పట్టింది. ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతి కళాశాలకు అవసరమైన మేరకు నిధులు మంజూరు చేయించారు. దీంతో నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ కళాశాల ఆధునీకరింపబడుతోంది. నాడు–నేడు సెకండ్ ఫేస్‌లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు రూ.43 లక్షల నిధులు మంజూరయ్యాయి. కళాశాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు వెలువడిన తర్వాత అడ్మిషన్లు మరింత పెరిగే అవకాశం ఉంది.

– ఎ.రఘుపతి, ప్రిన్సిపల్, బాలికల జూనియర్ కళాశాల, పుత్తూరు

తాగునీటి సమస్య పరిష్కారం



పైపులైన్ పూడిక పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నగరి : మున్సిపల్ పరిధిలోని పద్మావతి నగర్‌లో గురువారం తాగునీటి పైపులైన్ పనులను మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. ఇటీవల పద్మావతి నగర్‌లో మంత్రి ఆర్కే రోజా గడప గడపకు కార్యక్రమం నిర్వహించిన సమయంలో స్థానిక ప్రజలు నీటి సమస్యను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆమె వెంటనే అధికారులతో చర్చించి వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పైపులైన్ వేయాలని ఆదేశించారు. పాలనా పరమైన అంశాలు, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడానికి అవసరమయ్యే నిధులు మంజూరు కావడంతో పైపులైన్ పూడిక పనులు ప్రారంభమయ్యాయి. అడిగిన వెంటనే మంత్రి రోజా స్పందించి సమస్య పరిష్కారం చూపడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఈ నరేష్ బాబు, ఏఈలు రమేష్, నవీన్ పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగరాజు

పుత్తూరు రూరల్: కుటుంబాలను చిన్నాభిన్నం చేసే మాదక ద్రవ్యాలకు యువత బానిస కాకూడదని పుత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ ఏ.నాగరాజు కోరారు. గురువారం పట్టణంలోని పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో మాదక ద్రవ్యాలు–అనర్థాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ తాత్కాలిక ఆనందం కోసం ఎంతో విలువైన జీవితాలను కోల్పోవడం ఎంతటి అవివేకమో యువత ఆలోచించాలని కోరారు. ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల నడవడికపై శ్రద్ధ వహించాలని సూచించారు. కళాశాలల పరిసరాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈనెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సాన్ని పురస్కరించుకుని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు, కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్‌వీ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మహాభారత ఉత్సవాలు

పాలసముద్రం : మండలంలోని కృష్ణజమ్మపురం ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి అభయాంజనేయస్వామి మహాభారత ఉత్సవాలు శుక్రవారం నుంచి జరుగుతాయని ఆలయ ధర్మకర్త బాలయ్యనాయుడు గురువారం తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో హరికథా కాలక్షేపం, వీధినాటకాలు ఏర్పాటు చేశామన్నారు.

పశుబీమాతో పాడి రైతులకు ఊరట



అవగాహన కల్పిస్తున్న జిల్లా పశువైద్యాధికారి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): వైఎస్సార్ పశు బీమా పథకాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.ప్రభాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఏడీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ పశుబీమా రాయితీపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి మాట్లాడుతూ ఆర్బీకేలా వారీగా పశుబీమా టార్గెట్‌ను పూర్తి చేయాలని సూచించారు. ఇందులో పాలసముద్రం, గంగాధర నెల్లూరు మండలాలకు చెందిన పశు వైద్యాధికారులు, సిబ్బందికి బీమాపై అవగాహన కల్పించాలని సూచించారు. వారు వెళ్లి క్షేత్రస్థాయిలో రైతులకు బీమా సదుపాయం గురించి వివరించాలన్నారు. ప్రతి పాడి రైతు, గొర్రెల పెంపకందారులు బీమా చేయించేలా చూడాలన్నారు. ప్రీమియంలో 80 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఇప్పటివరకు జీడీ నెల్లూరులో 420 పాడి ఆవులకు, 20 గొర్రెలకు బీమా చేశారని తెలిపారు. అదేవిధంగా పాలసముద్రంలో కూడా 50 పాడి పశువులకు బీమా చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ అధికారి వినయ్‌కుమార్, డాక్టర్ చంద్రశేఖర్, ఏడీ డాక్టర్ ఆసీఫ్, డాక్టర్ మురళీమోహన్, పశువైద్యాధికారులు, సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఇంగ్లిష్ యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ ఇంగ్లిష్ వారు ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ అధ్యక్షతన గురువారం ఆన్‌లైన్ ఇంగ్లిష్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇంగ్లిష్‌ని మెరుగు పరుచుకోవడానికి అందుబాటులో ఉన్నటువంటి ఆన్‌లైన్ ఇంగ్లిష్ యాప్స్ గురించి తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల శ్రీకాళహస్తి అధ్యాపకులు, ప్రధాన రీసోర్స్ పర్సన్లు డాక్టర్ మాలతి గాబ్రియల్, డాక్టర్ ఎం.రేవతి డిగ్రీ విద్యార్థులు త మ ఇంగ్లిషను మెరుగు పరుచుకోవడానికి ప్రస్తు తం అందుబాటులో ఉన్నటువంటి ఆన్‌లైన్ అప్లికేష న్స్ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చా ర్జ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిష్, డాక్టర్ ఎం.పంకజ, అధ్యాపకులు నాగార్జున, లాల్‌బాషా పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్షపై వీసీ

విజయపురం (నగరి) : మండల కార్యాలయంలో నేడు (శుక్రవారం) జగనన్న సురక్ష కార్యక్రమంపై ఎంపీటీసీలకు వీసీ ఉంటుందని ఎంపీడీఓ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రతి ఎంపీటీసీ సభ్యుడు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రి అందిస్తున్న దాత

నగరి : మున్సిపల్ పరిధిలోని టీఆర్ కండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 49 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, షార్ప్‌నర్‌లను దాత బాలమురుగన్ స్టోన్ క్రషర్స్ ప్రొప్రైటర్ రాధాకృష్ణ శోభారాణి వితరణగా అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కవిత, స్కూల్ కమిటీ చైర్మన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు నేత్ర వర్ధన్‌రెడ్డి ఎంపిక



నేత్రవర్ధన్ రెడ్డి

వెదురుకుప్పం: మండలంలోని సంతబయలు గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి, ఉమాదేవి కుమారుడు టి.నేత్రవర్ధన్‌రెడ్డి ఎంపికయ్యాడు. ఇటీవల నిర్వహించిన నవోదయ ఎంట్రన్స్‌లో ప్రతిభను కనబరచినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

కాపు సంక్షేమ సేన అధ్యక్షుడిగా చిరంజీవి



చిరంజీవికి నియామకపత్రం అందిస్తున్న గోపిరాయల్

వెదురుకుప్పం: కాపు సంక్షేమ సేన మండల శాఖ అధ్యక్షుడిగా కురివికుప్పం గ్రామానికి చెందిన చిరంజీవి రాయల్‌ని నియమించినట్లు ఆశాఖ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గోపి రాయల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి రాయల్ మాట్లాడుతూ కాపుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు.

వేశాలమ్మ ఆలయ ఈఓగా మమత

తిరుపతి కల్చరల్: వేశాలమ్మ ఆలయ ఈఓగా కె.మమత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె సూళ్లూరుపేట గ్రూప్ ఆలయాల ఈఓగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆమెకు ఆలయ చైర్మన్ విజయకుమార్, మేనేజర్ హేమ చంద్రరావు, అర్చకులు స్వాగతం పలికారు. ఇక్కడ ఈఓగా ఉన్న కె.రామచంద్రారెడ్డి గుడిమల్లం ఆలయం రెగ్యులర్ ఈఓగా, సురుటుపల్లి ఆలయ ఇన్‌చార్జ్ ఈఓగా బదిలీ అయ్యారు. కార్పొరేటర్ నరసింహాచారి, వైఎస్సార్ సీపీ నేత సునీల్ చక్రవర్తి, మాజీ చైర్మన్ అశోక్ తదితరులు నూతన ఈఓ కె.మమతను శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

అద్భుతం.. జగనన్న సురక్ష కార్యక్రమం



సమావేశంలో మంత్రి ఆర్కే రోజా

- జగనన్న లాంటి మంచి సీఎం ఎవరికీ దొరకరు
- మంత్రి ఆర్కే రోజా

నగరి : జగనన్న సురక్ష ఎంతో అద్భుతమైన కార్యక్రమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో నగరి మున్సిపాలిటీ, నిండ్ర మండలాల జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ కారణం చేత అయినా అర్హులకు ఆగకూడదని, పార్టీలకు, కుల మతాలకు సంబంధం లేకుండా అర్హత ఉన్నవారికి పథకాలు, కావలసిన సర్టిఫికెట్లు అందాలన్న జగనన్న ఆలోచనలో నుంచి పుట్టిందే జగనన్న సురక్ష కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లకు సంబంధించి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కావలసిన పత్రాలను అప్పుడే సేకరించి వాటిని సచివాలయాల్లో పొందుపరచి టోకెన్లు అందజేస్తారన్నారు. వారం రోజుల తర్వాత మండలస్థాయి అధికారులు ప్రతి సచివాలయ పరిధిలో ఒకరోజు ఉండి పరిశీలించిన వివరాలను జిల్లాస్థాయికి అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడికక్కడే పథకాలు అందడంలో ఉన్న సమస్యలు పరిష్కరించడం, ఏ కారణం చేత రాలేదో తెలియపరచడంతో పాటు కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువీకరణ పత్రం, మరణ ధ్రువీకరణ పత్రం, వివాహ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్, మ్యుటేషన్ లావాదేవీలు, ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం, పంటసాగు హక్కు కార్డు, కొత్త, విభజన రైస్ కార్డు, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ విభజన పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వాటిని అక్కడే అందజేస్తారన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన

ఇంటివద్దకే పరిపాలన తీసుకువచ్చి వారి సమస్యలు పరిష్కరిండంతో పాటు, ఇంటి వద్దకే పెన్షన్, లబ్ధిదారుల ఖాతాల్లోకే సంక్షేమ పథకాల లబ్ధిని అందించి, ఎలాంటి అవకతవకలు లేకుండా పరిపాలన చేపడుతున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఏ రాష్ట్రంలో ఎవరూ చేయని విధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు గడపగడపకు వెళ్తున్నారంటే అది జగనన్న పాలనపై ఉన్న నమ్మకంతోనే అన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా వారి చెంతకే వెళ్లి పాలన అందిస్తున్నారని తెలిపారు. ఏవైనా స్థానిక సమస్యలు ఉంటే పరిష్కారానికి ప్రతి సచివాలయానికి రూ.2 లక్షలు, నియోజకవర్గ అభివృద్ధికి రూ.2 కోట్లు అందించారన్నారు. ప్రతి ఇంటి గురించి ఇంత శ్రద్ధ తీసుకుని పనిచేసే ముఖ్యమంత్రి మరొకరు ఉండరని అలాంటి వ్యక్తి పాలనలో మనం ప్రజాప్రతినిధులుగా ఉన్నందుకు గర్వపడాలన్నారు. పథకాల అమలులో తెలియకుండా ఎక్కడైనా పొరపాటు జరిగి ఉంటే దాన్ని సరి చేసుకోవడానికే జగనన్న సురక్ష అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, నిండ్ర ఎంపీపీ దీప, పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, మండల అధ్యక్షుడు వేణురాజు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు కోఆప్షన్ మెంబర్లు, వార్డు సచివాలయ కన్వీనర్లు, గ్రామ కార్యదర్శులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రాగి సాగుతో అధిక లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

విజయపురం (నగరి) : చిరుధాన్యం సాగులో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభం పొందవచ్చని ఏఓ రజినికుమారి తెలిపారు. గురువారం పన్నూరు ఆర్‌బీకే పరిధిలో చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ చిరుధాన్యాల సాగులో తక్కువ ఖర్చు ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. చిరుధాన్యంలో పురుగు, రోగాలు చాలావరకు ఉండవని, దీంతో రైతులు నష్టపోయే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. అంతేగాకుండా ప్రస్తుతం జీవన విధానంలో చాలామంది చిరుధాన్యాలు ఉపయోగిస్తున్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే పీఎం కిసాన్ కింద రూ.2 వేల చొప్పున ఏటా మూడు విడతల్లో రూ.6 వేలు లబ్ధి పొందే రైతులు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ–కేవైసీ) చేయించుకోవాలని ఏఓ గురువారం తెలిపారు. త్వరలో ఇవ్వనున్న 14వ విడత పీఎం కిసాన్‌కు కచ్చితంగా ఈకేవైసీ ఉండాల్సిందేనని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి రైతూ ఆధార్, దానికి అనుసంధానమైన ఫోన్ నంబరు, అలాగే ఓటీపీ ఆధారంగా నెలాఖరులోపు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి



ప్రత్యేక ప్రతిభావంతుల విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేస్తున్న ఎంఈఓ-2 మనోజ్‌కుమార్

కార్వేటినగరం: రాష్ట్రప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్దను నాణ్యతగా అందించాలని మండల విద్యాశాఖ అదనపు అధికారి(ఎంఈఓ–2) మనోజ్‌కుమార్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని భవిత సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్ల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. అందులో భాగంగా జగనన్న గోరుముద్దను రోజువారి మెనూతో విందు భోజనం వడ్డించేలా చేసిందన్నారు. విద్యార్థులు ప్రతిఒక్కరూ మధ్యాహ్న భోజనం తినే విధంగా చూడాలని ఆదేశించారు. అలాగే భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నారా లేదా అన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. వికలాంగత్వం కలిగిన విద్యార్థులు తప్పక ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకునేలా చూడాలని సహిత ఉపాధ్యాయురాలు సింధూజను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించండి




నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): పతనమైన మామిడి ధరలను పెంచడానికి అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మామిడి ధరలు పెంచి రైతులను ఆదుకోవాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతు అధ్యక్షుడు మాట్లాడుతూ పతనమైన మామిడి ధరలను పెంచడానికి జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడి తోతాపురి రకం మామిడికి రూ.20 వేలు కనీసం ధర చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జిల్లాలో మామిడిరైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. గతంలో జిల్లా కలెక్టర్ కిలో మామిడికి రూ.19 ధర చెల్లించాలని పరిశ్రమల యాజమాన్యాలను ఆదేశించారని గుర్తు చేశారు. అయితే కంటితుడుపు చర్యగా మూడురోజులు మాత్రమే ధరలు పెంచారని, ప్రస్తుతం రూ.10 నుంచి రూ.12 మాత్రమే చెల్లిస్తుండడంతో మామిడి రైతులకు గిట్టుబాటు ధర లేక భారీఎత్తున నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా వర్షాలు కురిసి మరింతనష్టం వాటిల్లుతోందన్నారు. ఏదేమైనా ప్రభుత్వ అధికారులు కల్పించుకుని మామిడికి గిట్టుబాటు ధర కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో రైతులు మరింత నష్టాల్లో కూరుకుపోతారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు హరిప్రసాద్ రెడ్డి, రవీంద్రరెడ్డి, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, నాయకులు సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలి

– జడ్జి కరుణకుమార్



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి కరుణకుమార్

గంగాధరనెల్లూరు (కార్వేటినగరం) : చట్టాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కరుణకుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన కల్పించిన హక్కులు, విధులతో పాటు చట్టాల పట్ల అవగాహన ఉంటే నిజజీవితంలో ఎదురయ్యే అనేక పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవచ్చన్నారు. సమాజంలో బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. న్యాయం కోసం కోర్టుకు వెళ్లే వారికి న్యాయవాదులు సైతం ఏర్పాటు చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్న వారికి ప్రభుత్వమే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయని వీటని ఎదుర్కోవడానికి ఈ చట్టాలపై అవగాహన ఉంటే సత్వరమే వాటికి పరిష్కారం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్ సుబ్రమణ్యం యాదవ్, ఎంపీడీఓ శ్రీదేవి, డిప్యూటీ తహసీల్దార్ తులసీరామ్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మహిళా సంఘ నేతలు పాల్గొన్నారు.